ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు

- రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్న వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, దుకాణాదారులు

నకిరేకల్ : పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతుంది. ప్రధానంగా తిప్పర్తిరోడ్డు, మూసీరోడ్డు, మెయిన్‌రోడ్డుతో పాటు పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న శివాజీనగర్‌కు వెళ్లేదారుల్లో వాహనాలు, ద్విచక్రవాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుంది. పోలీస్ సిబ్బంది మాత్రం సమస్యను అరికట్టలేకపోతున్నారు. పట్టణానికి వివిధ గ్రామాల, సమీప మండలాల నుంచి ప్రజలు వస్తుంటారు. వ్యాపార, విద్యాపరంగా శాలిగౌరారం, కట్టంగూర్, కేతేపల్లి, తిప్పర్తి మండలాల ప్రజలతో పాటు మోత్కూరు మండలం నుంచి వస్తుంటారు. ప్రధానంగా ఇందిరాగాంధీ సెంటర్ నుంచి బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్ సమస్య గందరగోళంగా మారుతుంది. మరో వైపు హైదరాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులన్నీ తిప్పర్తిరోడ్డు నుంచి వస్తుండడం


తిప్పర్తి రోడ్డులో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్

తో మరింత రద్దీ కనిపిస్తోంది. ఇరుకైన ప్రధాన వీధుల్లో సరుకుల లోడ్ దించేందుకు, ఎక్కించేందుకు లారీలు, ఆటోలు రోడ్లపైనే నిలుపుతుండడంతో ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోతుంది. మెయిన్ సెంటర్‌లో ఆటోలు, ఇతర వాహనాలు అడ్డదిడ్డంగా నిలపడంతో పాటు చిరు వ్యాపారులు రోడ్ల మీదకు రావడంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతుంది. మరోవైపు రహదారులపై బండ్లతో చిరు వ్యాపారాలు చేయడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ఈ దారుల్లో వాహనాలకు పార్కింగ్ లేకపోవడంతో అడ్డదిడ్డంగా నిలుపుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్నాం



శివాజీనగర్‌కు, ఎస్‌బీఐకి వెళ్లే దారిలో ద్విచక్ర వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపి తమ పనుల నిమిత్తం వెళ్తున్నారు. ఉదయం ద్విచక్రవాహనాలు పెట్టి రాత్రికి తీసుకెళ్తున్నారు. మా దుకాణాలకు వచ్చేవారికి ఇబ్బంది కలుగుతుంది. దీంతో వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. అదే విధంగా ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నాం. ఈ సమస్య పరిష్కరించాలని పలుమార్లు దరఖాస్తు చేసినా ఫలితం ఉండడం లేదు.

– శ్రీమన్నారాయణ,
కిరాణదుకాణాదారుడు, నకిరేకల్

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ గురువారం తెలిపారు. స్థానిక పద్మావతికాలనీ, క్రాంతినగర్ కాలనీల్లో 11కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు నిలిపివేస్తున్నట్లు, అందుకు కాలనీల ప్రజలు సహకరించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న అమరేందర్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : వేసవి సమీపిస్తున్నందున పట్టణంలోని దేవరకొండ రోడ్డులో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు, పాదచారులకు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొప్పుల సుధాకర్, నన్నూరి మురళీమోహన్‌రెడ్డి, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, జొన్నలగడ్డ శేఖర్‌రెడ్డి, నిమ్మల శ్రీనివాస్‌రెడ్డి, కేసాని వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్, టీబీ వ్యాధులపై అవగాహన

తిప్పర్తి : మండల కేంద్రంలో శ్రీసాయి అకాడమి కళాకారులు ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వైఆర్‌జీ కేర్ లింకు వర్కర్ స్కీం ఆధ్వర్యంలో గురువారం ఎయిడ్స్, టీబీ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్, టీబీ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో చెట్టుపల్లి వెంకన్న, జయకుమార్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి నీరు అందిస్తాం


నీటి సరఫరాను పరిశీలిస్తున్న
ఏఈ రామచంద్రయ్య

చండూరు : మండలంలోని పడమటి తాళ్ల గ్రామంలో అన్ని ఇళ్లకు నీరు అందిస్తామని, ఇప్పటికై నూతన మోటార్‌ను ఏర్పాటు చేసిన సరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామచంద్రయ్య తెలిపారు. పడమటి తాళ్ల గ్రామంలో నీటి సమస్య ఉండడంతో బుధవారం అధికారులు నూతన బోరు వేయించారు. ఆ బోరు సక్సెస్ కావడంతో గురువారం మోటార్‌ను బిగించి నీటిని సరఫరా చేయించారు. ఈ సందర్భంగా ఏఈ ఇంటింటికి తిరిగి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామంలో నీటి సమస్య పరిష్కరించినట్లు వెల్లడించారు. ఎవరూ నీటిని వృథా చేయకుండా చూడాలని ఆయన కోరారు.

8నుంచి శ్రీతిరుమలనాథ స్వామి కల్యాణోత్సవం


శ్రీతిరుమలనాథ స్వామి మూలవిరాట్

చిట్యాల : మండలంలోని పెద్దకాపర్తి గ్రామపరిధిలో గల శ్రీతిరుమలనాథ స్వామి కల్యాణోత్సవాన్ని ఈ నెల 8నుంచి 10వతేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో 8న ఫలహారపు బండ్ల ప్రదర్శన, 9న శ్రీతిరుమలనాథ స్వామి కల్యాణం, 10న రథోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఎఫ్‌సీఐలో వైద్యశిబిరం


వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

నల్లగొండ : పట్టణంలోని ఎఫ్‌సీఐ ఎంప్లాయీస్ కమ్యూనిటీ హాల్‌లో భారత ఆహార సంస్థ, గుంటూరు సాయిభాస్కర్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గుంటూరుకు చెందిన సీనియర్ జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ శిబిరంలో ఎఫ్‌సీఐ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ యరగాటి సాంబశివారెడ్డి, కెఎన్‌కె.ప్రసాద్, లక్ష్మారెడ్డి, మాదగోని భిక్షపతి, ప్రసాద్, గాంధీ, యూసఫ్, జానిమియా, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

తిప్పర్తి : వచ్చే వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవికాలంలో తాగునీటి సమస్యలు ఉన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీలను పకడ్బందీగా అమలు చేసి ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచి ప్రతి గ్రామంలో పను


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

లు ప్రారంభించాలన్నారు. మార్చి చివరి నాటికి ఇంటి పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ జానయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగభవానీ తదితరులు పాల్గొన్నారు.

శివలీలకు ఉమెన్ ఐకాన్ అవార్డు


శివలీల

కనగల్ : మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టరేట్ అవార్డు గ్రహీత, ఆర్‌ఎంపీ వైద్యురాలు కంబాల శివలీలకు ఉమెన్ ఐకాన్ అవార్డు లభించనుంది. ఆమె సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించిన విస్డమ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అనుమడ్ల నాగరాజు, డాక్టర్ లయన్ పద్మావతి ఆధ్వర్యంలో ఉమెన్స్ డే సందర్భంగా అవార్డును రాంపూర్ హన్మకొండలో ఈ నెల 7న అందించనున్నట్లు ఆమె వెల్లడించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాల : కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా అందిస్తున్న బ్యాంకు రుణాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వంశీ, పశువర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ జీవీ రమేష్ పేర్కొన్నారు. చిట్యాల ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో 26మంది పాడి రైతులకు రూ.22లక్షల రుణాలకు సంబంధించి మంజూరు పత్రాలను గురువారం ఆ బ్యాంకులో లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి మరిన్ని సేవలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జిల్లా సహాయ సంచాలకుడు డాక్టర్ సయ్యద్ ముస్తాక్ ఖాద్రి, చిట్యాల శాఖ ఎస్‌బీఐ మేనేజర్ వరప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్


చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్
వంశీ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రమేష్

శ్రీనివాసరావు, పశువైద్యాధికారులు డాక్టర్ వి.అభినవ్, డాక్టర్ జె.అమరేందర్, మదర్ డైయిరీ మేనేజర్ కర్నాటి చెన్నారెడ్డి, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూ

చిట్యాల : మండలానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక 2024–25కు గాను దివ్యాంగుల కార్పొరేషన్ ద్వారా ఒక యూనిట్ (రూ.50లు) మంజూరైనట్లు ఎంపీడీఓ జయలక్ష్మి గురువారం తెలిపారు. ఈ రుణాల మంజూరుకు గాను ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం ఉదయం 11గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు దరఖాస్తుదారులు తగిన ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆమె సూచించారు.

ఇచ్చిన హామీని కొనసాగిస్తూ..

చిట్యాల : మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రచారంలో భాగంగా తనను కౌన్సిలర్‌గా గెలిపిస్తే ఏడో వార్డులో వివాహమయ్యే ప్రతి యువతి పెళ్లికి కానుకగా రూ.10,016 అందజేస్తానని స్థానిక మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయనను వార్డు ప్రజలు గెలిపించడంతో వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో ఆయన ఐదేళ్లగా ఆ వార్డులో వివాహమైన సుమారు 25మంది యువతుల వివాహాలకు కానుక అందించారు. గత జనవరిలో పదవీకాలం పూర్తైనా గురువారం ఆ వార్డుకు చెందిన మేడి శ్వేతకు పెళ్లి కానుకను అందజేశారు.

ముగిసిన శ్రీపార్వతీశంభులింగేశ్వర బ్రహ్మోత్సవాలు


అగ్నిగుండాల కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామంలో గల శ్రీపార్వతి శంభులింగేశ్వర దేవాలయం బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ఏకాంత సేవలతో ముగిశాయి. ఈ నెల 26న మహాశివరాత్రితో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం తెల్లవారుజామున దేవాలయం ముందు అగ్నిగుండాల కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అగ్నిగుండాల నుంచి మొదటగా పార్వతీశంభులింగేశ్వర దేవతామూర్తుల శావవెళ్లిన అనంతరం భక్తులు అగ్నిగుండాలను తొక్కారు. అనంతరం దేవతామూర్తులు నందీశ్వర వాహనంపై గ్రామంలో ఊరేగించారు. బ్రహ్మోత్సవాలు ఆలయ వంశపారంపర్య పూజారులు వావిలాల వేణునాథశర్మ, రామలింగయ్య శర్మ, ఫణికుమార్‌శర్మల నేతృత్వంలో జరిగాయి.

సూర్యకుమార్‌కు సత్కారం


సత్కారం అందుకుంటున్న సూర్యకుమార్

నకిరేకల్ : పట్టణానికి చెందిన చరిత్రకారుడు, రిటైర్డ్ అధ్యాపకుడు డి.సూర్యకుమార్‌కు జాతీయ సెమినార్‌లో గౌరవం దక్కింది. కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రాచీన తెలుగు భాష అధ్యయన కేంద్రంలో నెల్లూరు వారు గురువారం ఏర్పాటు చేసిన ప్రాచీన తెలంగాణ వాఙ్మయం అవలోకనం అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో డి.సూర్యకుమార్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం కాకతీయుల పూర్వ రాజవంశాల శాసనాలు, తెలుగు సాహిత్యం అనే అంశంపై తన పరిశోధక పత్రం సమర్పించారు. దీంతో నిర్వాహకులు సూర్యకుమార్‌కు శాలువా కప్పి ప్రత్యేకంగా సత్కరించారు.

ఉపాధిహామీ పథకాన్ని కొనసాగించాలి

చిట్యాల : మున్సిపాలిటీలో ఉపాధిహామీ పథకాన్ని కొనసాగిస్తూ కూలీలకు ఉపాధి కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారంమున్సిపాలిటి పరిధిలోని వెంకటాపురం (ఆరో వార్డు)లో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీ ఏర్పాటుతో ఉపాధిహామీ పథకం రద్దు కావడంతో రోజు వారీ కూలీలకు ఇబ్బందిగా మారిందన్నారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసాను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 13న మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా, రిలే దీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శంకరయ్య

కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, పార్టీ పట్టణ కార్యదర్శి బొబ్బలి సుధాకర్ రెడ్డి, వెంకన్న, పాలమాకుల అర్జున్, శిరబోయిన గట్టయ్య, అవిశెట్టి నర్సింహ, మహేష్, కిరణ్, వెంకన్న, శివ, సత్తయ్య పాల్గొన్నారు.

ఎస్‌పీఆర్ విద్యార్థులకు ర్యాంకులు

నకిరేకల్ : ఇటీవల బ్రిలియంట్ ఒలింపియాడ్ వారు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో పట్టణంలోని ఎస్‌పీఆర్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయి ర్యాంకులు సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.కన్నయ్యగౌడ్ గురువారం తెలిపారు. పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి డి.చరణ్ సాయిరామ్, 10వతరగతి విద్యార్థిని జి.ఖ్యాతీ జిల్లా ప్రథమ ర్యాంకులు సాధించారన్నారు. తెలంగాణలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తమ పాఠశాలకు చెందిన సుందరి శివరామకృష్ణకు దక్కిందని వెల్లడించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను, ఉత్తమ అవార్డు పొందిన సుందరి శివరామకృష్ణను పాఠశాల చైర్మన్ అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, విజనరి శ్రీపతిరెడ్డి అభినందించారు.

పేదలకు ఆత్మీయ భరోసా అమలు చేయాలి

నల్లగొండ టౌన్ : పట్టణంలోని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టణ పేదల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా రూ.12వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిందన్నారు. పట్టణాలకు వలస వచ్చి జీవిస్తున్న కూలీలకు, పట్టణ పేదలకు కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయాలన్నారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, దండంపల్లి సరోజ, అద్దంకి నరసింహ, గంజి నాగరాజు, భూతం అరుణ, లింగమ్మ, అవుట రవీందర్, గౌరిదేవి, మధు, శ్రీవాణి, లావణ్య, సరస్వతి, జయమ్మ, పద్మ, అంజయ్య పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఎండీ సలీం



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నల్లగొండ పట్టణంలోని టీఎన్‌జీఓ భవన్‌లో గురువారం నిర్వహించిన చెస్, క్యారమ్, అంత్యాక్షరి, ఉపన్యాస, మ్యూజికల్ చైర్స్, పాటల పోటీలు, తెలుగులో మాట్లాడటం, క్విజ్, డ్యాన్స్ పోటీల్లో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రావొద్దు

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చండూరు : వేసవి దృష్ట్యా చండూరు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పన, జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుపై గురువారం ఆయన హైదరాబాద్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు కొత్తగా నిర్మించిన ట్యాంకులు, పైపు లైన్లు వాటి కనెక్టివిటీ, తాగునీటి వనరుల లభ్యతపై చర్చించారు. డ్రెయినేజీ పనులు, తాగునీటి పైపు లైన్ల పనుల అభివృద్ధిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో చండూరు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


హైదరాబాద్‌లోని తన నివాసంలో అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


యూబీఐ బ్యాంకును ప్రారంభిస్తున్న కలెక్టర్

కనగల్ : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండల కేంద్రంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త బ్రాంచ్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కనగల్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటుతో మండలంతో పాటు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కనగల్ మండల శాఖ జిల్లాలో 25వ బ్రాంచ్ అని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. అనంతరం బ్యాంక్ తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ కారే భాస్కరరావు మాట్లాడుతూ.. మండలంలో ఉన్న అన్ని గ్రామాలకు తమ బ్యాంకింగ్ సేవలు అందజేయడానికి అత్యాధునిక సౌకర్యాలతో ఈ శాఖను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఏ.మురళీకృష్ణ, రాజేశ్వరి, రాజేష్, రఘురాం, బీఆర్‌ఎం కోటేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ మోహన్, ఎల్డీఎం శ్రామిక్, కనగల్ తహసీల్దార్ పద్మ, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

నకిరేకల్ : వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాతృనాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డులను పరిశీలించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యసిబ్బందితో మాట్లాడారు. వేసవి నేపథ్యంలో ఆసుపత్రిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా ఆసుపత్రిలో ప్రసవ కేసులు తగ్గినందున పెంచడంపై దృష్టి సారించాలన్నారు. రోగులకు ఇచ్చే ఆహార పంపిణీలో నాణ్యత పాటించాలన్నారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ శోభారెడ్డి ఉన్నారు.


ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న
డాక్టర్ మాతృనాయక్

పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీదేవి

మర్రిగూడ : ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా వాటిని పూర్తి చేయాలని చండూరు ఆర్డీఓ శ్రీదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వారి నుంచి దరఖాస్తులను స్వీకరించి సత్వరమే పరిష్కరించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ బక్కా శ్రీనివాసులు, డీటీ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌నాయక్, ఆర్‌ఐ పాండురంగారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సువర్ణ, సిబ్బంది రమేష్, వెంకటేష్, మధు, లింగస్వామి ఉన్నారు.

వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కేతేపల్లి : వరిసాగులో రైతులు సకాలంలో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టి తెగుళ్ల బారిన పడకుండా కాపాడుకోవాలని మండల ఏఓ బి.పురుషోత్తం సూచించారు. గురువారం మండలంలోని కొత్తపేటలో వరిపొలాలను ఆయన పలువురు రైతులతో కలసి పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడారు. ప్రస్తుతం వరిలో అగ్గితెగులు ఆశించనట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు తీవ్రతను బట్టి 0.6గ్రాముల ట్రైసైక్లజోల్ మందును లీటరు నీటికి పిచికారీ చేయాలన్నారు. కాండం కుళ్లు తెగులు నివారణకు 2మీ.లీ వాలిడామైసిన్ లేదా 2మీ.లీ. హెక్సకనాజోల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ నాగరాజు, రైతులు సోమయ్య, నర్సయ్య, పాపయ్య తదితరులు ఉన్నారు.


కొత్తపేటలో వరిపంటను పరిశీలిస్తున్న
ఏఓ పురుషోత్తం

బీజేపీ నాయకుల విజయోత్సవ సంబరాలు


సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

కేతేపల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన ఇద్దరు అభ్యర్థులు విజయం సాధించడం పట్ల మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు గురువారం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాచకొండ గోపి, నాయకులు టి.నర్సింహాచారి, కూరెళ్లి వెంకటేశ్వర్లు, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, సమ్మెట విజయలక్ష్మి, పద్మ, గుంటి నరేష్, అఖిల్, చంటి, సందీప్, లింగాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం పట్ల పట్టణంలో ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు బుడిగె సైదులు మాట్లాడారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు యానాల శ్రీనివాస్‌రెడ్డి, గర్రె మురళి, చౌగోని నాగయ్య, చెనగాని రాములు, తదితరులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం


చందంపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో..

నకిరేకల్ : మండలంలోని చందంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ పాత్రలతో అలరించారు. అనంతరం విద్యార్థులకు మాజీ సర్పంచ్ నూకల రఘునందన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.నవీన్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మునుగోగి ఎస్తేర, ఉపాధ్యాయులు గోవర్ధన్, ఆదిత్య, అనిత, శ్రీహరి, రమణ, శ్రీనివాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం నిర్ణయించాలని వినతి

నల్లగొండ టౌన్ : షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాల జీఓను సవరించి రూ.26వేల వేతనంగా నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా కలెక్టరేట్ ఏఓకు ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో కోటి 20లక్షల మంది కార్మికులకు వర్తించే షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాల జీఓలు 2012 నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆయన వెంట చింతపల్లి బయ్యన్న, పోలె సత్యనారాయణ, ముత్యాలు, బొంగర్ల మల్లయ్య, యాదయ్య ఉన్నారు.


ఏఓకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు